విశాలాంధ్ర
శ్రీకాకుళం
శుక్రవారం 18, అక్టోబర్, 2024
పేజ నెం. 9

విద్యార్థులను తమ బిడ్డల్లా చూడాలి

విశాలాంధ్ర - సోంపేట: వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులను తమ బిడ్డల్లా చూడాలని సోంపేట 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి కె.కిషోర్‌బాబు పేర్కొన్నారు. ఆయన గురువారం కంచిలి మండలం జాడుపూడిలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, అలాగే కంచిలిలో గల ప్రభుత్వ బాలుర వసతి గృహాలను పరిశీలించారు. ఆయా వసతి గృహాలు విద్యాలయాల్లో విద్యార్థుల తరగతి గదులు, వాష్‌రూంలు, వంటగదులు, పరిసరాలను పరిశీలించారు. ఆయా చోట్ల అధికారులు మరింత శ్రద్ధ తీసుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు పెంపొందిస్తూ విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. భోజనాలు మెనూ ప్రకారంగా ఇస్తున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- అనుమతుల్లేని బాలల సంరక్షణ కేంద్రాలను మూసివేయాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బాలల రక్షిత గృహాల నిర్వహణపై ఆయన సంబంధిత అధికారులు స్వచ్ఛంద సంస్థలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 11 బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోగా 13 బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ లేకుండా బాలల సంరక్షణ కేంద్రాలు నిర్వహించే కేంద్రాలపై కేసు నమోదు చేయాలన్నారు. అనుమతులు లేని బాలల సంరక్షణ కేంద్రాలను తక్షణమే మూయించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో ఖాళీలు ఉన్నాయని రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్న బాలల సంరక్షణ కేంద్రాలలో ఉన్న బాలలను ప్రభుత్వ వసతి గృహాలలో చేర్పించాలన్నారు. వసతి గృహాల్లో సీట్ల కేటాయింపునకు డీఈఓ, ఐసీడీఎస్ పీడీలతో కమిటీ ఉంటుందని, బాలల కోసం ఫిర్యాదులు వస్తే కమిటీకి తెలియజేయాలన్నారు. బాలల రక్షిత గృహాలలో దత్తతకు అర్హులైన బాలల యొక్క వైద్య పరీక్షల నివేదికలు వెంటవెంటనే మహిళా శిశు సంక్షేమ అధికారిణికి సమర్పించాలన్నారు. ప్రైవేటు వసతి గృహాలు రిజిస్ట్రేషన్లు డీఈవో వద్ద చేయించు కోవాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి బి.శాంతి శ్రీ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలు ప్రభుత్వ పరంగా స్వచ్ఛంద సంస్థలు బాలల న్యాయ చట్టం ప్రకారం, ప్రభుత్వ నిబంధనలు అనుసరించి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని చెప్పారు. అనంతరం మునగ చెట్లు మహిళల ఆరోగ్యానికి తొలిమెట్టు అనే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.మీనాక్షి, బాలల సంరక్షణ అధికారి కె.రమణ, ఆర్‌ఐఓ దుర్గారావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంక్షేమ అధికారిణి అనురాధ, విద్యా శాఖ ఎడి లియాఖత్ అలీఖాన్, గిరిజన సంక్షేమ శాఖ ఎటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, స్వచ్ఛంద సంస్థలు, తదితరులు పాల్గొన్నారు.

మౌళిక సదుపాయాలకు పెద్దపీట

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి: గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీడీపీ సీనియర్ నేత మాదిన రామారావు పేర్కొన్నారు. కంచిలి మండలం ఎస్ఆర్‌సి పురం, పురుషోత్తపురం, బొగాబెణి గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎక్కడ అభివృద్ధి జాడ లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి నియోజకవర్గానికి కోట్లాది రూపాయలు మంజూరు చేసి అభివృద్ధికి మంచి అవకాశం కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కోతకు గురైన తీరం

- ఇద్దివానిపాలెం వీధుల్లోకి సముద్రం నీరు

విశాలాంధ్ర - కవిటి: కవిటి మండలం తీర ప్రాంతం గ్రామమైన ఇద్దివానిపాలెం వద్ద గురువారం ఉదయం సముద్రం ఒక్కసారిగా అల్లకల్లోలంగా మారింది. ఒక్కో కెరటం 5 మీటర్ల ఎత్తువరకు ఎగసిపడడంతో సముద్రం నీరు ఒక్కసారిగా గ్రామంలోని వీధుల్లోకి వచ్చేసింది. దీంతో మత్స్యకారులు భయాందోళనకు గురయ్యారు. తీరంలో ఉంచిన వలలు, పడవలు చెల్లా చెదురయ్యాయి. అంతే కాకుండా ఇద్దివానిపాలెం, బట్టివానిపాలెం, కర్రివానిపాలెం గ్రామాల వద్ద అలల తాకిడికి తీరం కోతకు గురైంది. గురువారం పౌర్ణమి కావడంతో పెద్ద పెద్ద అలలు ఎగసిపడ్డాయి.

చెత్తను తొలగించిన పారిశుద్ధ్య కార్మికులు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర -టెక్కలి: ఎక్కడ చూసినా చెత్త కుప్పలే... మినీ డంపింగ్ యార్డుగా రోటరీ నగర్ అని విశాలాంధ్ర పత్రికలో బుధవారం వచ్చిన కథనానికి ఎట్టకేలకు అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ ఆదేశాల మేరకు గత కొన్ని రోజుల నుండి నిల్వ ఉన్న చెత్తకుప్పలను ఈవో జగన్నాధరావు పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులతో తొలగించి శుభ్రపరిచారు. మినీ డంపింగ్ యార్డులుగా పడి ఉన్న చెత్తను తొలగించినందుకు పంచాయతీ అధికారులకు, పారిశుద్ధ్య కార్మికులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఇకనుండి ఖాళీ ప్రదేశాలలో చెత్తను పారబోయ కూడదని, అలా పారబోస్తే వారిపై చర్యలు తీసుకోబడతాయని పంచాయతీ అధికారులు వీధి ప్రజలకు సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - మందస: సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పి.రఘువర్మ తెలిపారు. గురువారం మండలంలో మందస, చీపి, కిల్లోయి, బుడంబో, చినకోష్ట, పట్టులోగాం ఆశ్రమ పాఠశాలలు, ఆర్.కె.పురం సాంఘిక సంక్షేమ పాఠశాలలు, సిరిపురం, కృష్ణాపురం ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో అందరి ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా పని చేస్తానని అన్నారు. 1,2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈ నెల 12 నుంచి ట్రైనింగ్ మండల స్థాయిలో ఇవ్వాల్సిందిగా అధికారులకు ప్రాతినిధ్యం చేశామని అన్నారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు గవ్వ భీమారావు, ఎస్.కిరణ్‌కుమార్, వి.వి.వరప్రసాద్, ఎన్.కరుణాకర్, డి.వైకుంతరావు, ఎన్.ఢిల్లేశ్వరరావు, బి.బైరాగిలు పాల్గొన్నారు.

అంగన్వాడీ పాల ప్యాకెట్లు పక్కదారి

విశాలాంధ్ర - టెక్కలి: కేంద్ర ప్రభుత్వాలు లక్షల కోట్లు ఖర్చుపెట్టి అంగన్వాడీ కేంద్రాలకు అందిస్తున్న పాలు ప్యాకెట్లు పక్కదారి పడుతున్నాయి. అంగన్వాడీలో ఉన్న గర్భిణీలకు, చిన్నపిల్లల ఆరోగ్యం కోసం, శరీర దృఢత్వం కోసం, బలం కోసం పాల ప్యాకెట్లు అందిస్తుంటే కొంతమంది అంగన్వాడి సిబ్బంది తమ సొంత లాభం కోసం పాల ప్యాకెట్ల రికార్డులు తారుమారు చేస్తూ, వ్యాపారస్తులకు అందించి అధిక మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. టెక్కలి మేజర్ పంచాయతీ పెద్ద బ్రాహ్మణ వీధి జంక్షన్ ఓల్డ్ ఎన్‌హెచ్ 5 రోడ్డు సమీపంలో గురువారం గుంపు గుంపులుగా ఖాళీ పాల ప్యాకెట్లు దర్శనమిచ్చాయి. ఈ విధంగా వ్యాపారాలు ఎంత కాలం నుండి కొనసాగిస్తున్నారో... ఎంత సొమ్ము చేసుకుంటున్నారో... ఒకసారి ఆలోచిస్తుంటే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ లింగరాజు చిట్టిబాబికి, స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

గద్దరన్న ఉద్యమ పోరే...దళితన్నలకు మేల్కొలుపు

- విశాఖ బహిరంగ సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - పొందూరు: విప్లవ ఉద్యమ పోరాటాల పోరుగడ్డ - విశాఖలో ఈనెల 20వ తేదీన గద్దరన్న కూతురు నోట "ఎర్ర మల్లెలు" విరబూసి పోరు జెండాలై పరవళ్ళు తొక్కబోతున్నాయని బహుజన కళామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆతవ ఉదయకుమార్ అన్నారు. స్థానిక బి.ఆర్.అంబేద్కర్ సెంటర్ ఆవరణలో విలేకరులతో మాట్లా డుతూ విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రజా యుద్ధ నౌక గద్దరన్న యాదిలో వెన్నెల గద్దర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. అణగారిన వర్గాల అమాయకత్వాన్ని బానిసలుగా మార్చే స్వార్ధ పెత్తందారుల ఆగడాలపై, సాహసం, దిక్కరం, తిరుగుబాటు లాంటి ధోరణులు అలవరచుకోవాలన్నారు. బహుజన కళామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామ్రాట్ అశోక్ చక్ర అవార్డు గ్రహీత ఆతవ ఉదయకుమార్ సౌజన్యంతో విప్లవ గీతాలతో దళిత, సామాజిక అణిచివేతలు, నిర్బంధాలపై తిరుగుబాటు బావుటతో నిప్పులు కురిపించబోతున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు.

ఎస్‌హెచ్‌జిల జీవనోపాధి మెరుగుకు చర్యలు

డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళా సంఘాలకు స్వయం ఉపాధి కోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్ అన్నారు. గురువారం సంతబొమ్మాళి మండలం సీతానగరం గ్రామంలోని కొండ చీపుర్లు తయారీ యూని ట్లను సందర్శించి సభ్యుల అభిప్రాయాలు, వారికి ఉన్న ఇబ్బందులు తెలుసుకున్నారు. సభ్యులు తయారు చేస్తున్న ఉత్పత్తులను ఆన్లైన్ మార్కెటింగ్ ద్వారా విక్రయించి, సభ్యుల ఆదాయం పెంచుటకు సెర్ప్ సంస్థ పని చేస్తున్నట్లు తెలియజేశారు. మండలంలో గల 50 గ్రామ సంఘాల నుండి ఈ ఏడాది 50 రకాల ఉత్పత్తులను ఆన్లైన్ మార్కె టింగ్‌లో రిజిస్ట్రేషన్ చేసి విక్రయాలు జరిపించుటకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎం ఎల్‌హెచ్.నారాయణరావు, డిపిఎం బ్యాంకు లింకేజి నాగ లక్ష్మి, ఏరియా కోఆర్డినేటర్ ఎస్.శ్రీరాములు, ఏపీఎం ఎల్‌హెచ్. ఈశ్వర రావు, ఏపీఎం టి.సూర్యనారాయణ, సీసీలు వరదరాజు, సరోజినీ పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపును ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే

విశాలాంధ్ర - నరసన్నపేట: మండలంలో గోపాలపెంట ఇసుక ర్యాంపును గురువారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నియోజకవర్గ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, పుండర్కర్ మాట్లాడుతూ ఇసుక రవాణా పారదర్శకంగా జరగాలని, ఆన్‌లైన్ విధానంలో 50 శాతం, ఆఫ్‌లైన్‌లో 50 శాతం ప్రతీ రోజూ ఇసుక రవాణా సాగుతోందని తెలిపారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు వల్ల ఇసుక రవాణాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని, ప్రస్తుతం ఇసుక పారదర్శకంగా జరుగుతుందని అన్నారు. జిల్లాలో మరికొన్ని చోట్ల ఇసుక ర్యాంపులు ప్రారంభిస్తామని, నిర్మాణ రంగాన్ని బలోపేతం చేయడంలో టీడీపీ ముందుంటుందని తెలిపారు. సామాన్యుడికి అందుబాటులో తేవటానికి ఇసుక రవాణా ఉచితం చేస్తామని, ప్రకృతికి ఇబ్బంది కల్గకుండా సీనరీ ఛార్జీలు వసూలు చేయటం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సత్యన్నారాయణ, సూపరింటెండెంట్, కె.ప్రత్యూష పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో తిలారు రైల్వే స్టేషన్

విశాలాంధ్ర - జలుమూరు: గురువారం కురిసిన వర్షంతో జలు మూరు మండలం తిలారు రైల్వే స్టేషన్ జలదిగ్బంధమైంది. రైల్వే స్టేషన్లో నూతనంగా నిర్మించిన కొత్త భవనాలు వలన లోతట్టు ప్రాంతంలో చిన్నపాటి వర్షం కురిసినా పూర్తిగా జలమయం అవుతుంది. కనీసం ప్లాట్‌ఫారానికి చేరుకోవాలన్నా, రైలు ఎక్కాలన్నా ప్రయాణి కులు అనేక అవస్థలు పడుతున్నారు. ఇటువంటి చిన్నపాటి సమస్యలను రైల్వే అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్

- సహాయ సంచాలకులు కె.కవిత

విశాలాంధ్ర -శ్రీకాకుళం: ఈ నెల 18వ తేదీ శుక్రవారం ఉదయం 10.00 గంటలకు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు వినతుల స్వీకరణ ఉంటుందని, ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక జ్ఞాన ప్రధాత వాల్మీకి మహర్షి

- ఎస్పీ మహేశ్వర రెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: భారతదేశానికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించిన గొప్ప వ్యక్తి వాల్మీకి మహర్షి అని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి కొనియాడారు. గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి లాంటి మహోన్నత వ్యక్తి యొక్క జీవితం, రచనలు, కావ్యాలు ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని సన్మార్గంలో నడవాలని జిల్లా ఎస్పీ కోరారు. రామాయణం లాంటి మహాకావ్యాన్ని రచించి, సమాజానికి అందించిన వాల్మీకి మహర్షి చూపిన దారి మనందరికీ అనుసరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ఎల్.శేషాద్రి, కార్యాలయ పరిపాలన అధికారి సిహెచ్ గోపీనాథ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

వివిధ కంపెనీలకు 67 మంది ఎంపిక

విశాలాంధ్ర - టెక్కలి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలని ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా టెక్కలికి సంబంధించి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళా గురువారం నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళాకి 4 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. దీనిలో 159 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా, అందులో 67 మందిని వివిధ కంపెనీలకు ఎంపిక చేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ మాట్లాడుతూ జాబ్ మేళాకి హాజరైన ప్రతి నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి మొట్టమొదటి కవి వాల్మీకి

విశాలాంధ్ర - పోలాకి: ప్రపంచానికి మొట్టమొదటి కవి వాల్మీకి అని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. గురువారం మండల కార్యాలయంలో వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత, మహా పుత్రుడు, గుణవంతుడు, ధనవంతుడు, కవి సార్వభౌముడు, భారతదేశానికే వాల్మీకి రచించిన రామాయణం వంటి ఇతిహాసాలు ఎన్నో గ్రంధాలు కవితలు గర్వకారణమని అన్నారు. వాల్మీకి విశిష్టతను దేశానికే ఉదాహరణ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ సూర్య ప్రకాష్, రామచంద్ర, మండల కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్: పల్లెల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని కల్లేపల్లి, పీజీపేట, నైర, పొన్నాం, బట్టేరు ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకర్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమపై పెంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పల్లె ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ఏ గ్రామంలో ఏ పనులు అవసరమో వాటిని పూర్తి చేసేందుకు అందుకు తగ్గ నిధులు కూడా విడుదల చేశామన్నారు. మంచి పాలన అందించడమే పాలకుల లక్ష్యమని అందుకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రాధాన్యత

ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని నియోజకవర్గ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం ఆయన మండలంలోని పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా చిక్కాలవలస నుండి మామిడివలస గ్రామం వరకూ సిసి రహదారి నిర్మాణానికి సుమారు రూ.40లక్షలతో అలాగే ఆర్ అండ్ బి రోడ్ నుండి కుద్దాం వరకూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద రూ.50 లక్షల నిధులతో సిసి రహదారి నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. అలాగే నరసన్నపేట ఎన్‌హెచ్-16రహదారి నుండి సత్యవరం వయా లఖిమేర గ్రామానికి ఎన్ఆర్‌జిఎస్ నిధులు రూ.1కోటితో బి.టి రహదారి నిర్మాణానికి, మండలంలో ముషిడి గట్టు నుండి వయా ఉప్పరిపేట, లుకులాం వరకూ ఉపాధి నిధులు రూ.2కోట్లతో బి.టి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలలకే గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బగ్గు అర్చన, వంగ బావాజీనాయుడు, శిమ్మ చంద్రశేఖర్, ముంజ రంగనాయకులు, శిమ్మ జగన్నాధం, వంజల రామరాజు, అడపా చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, కింజరాపు సూర్యనారాయణ, ముద్దాడ అప్పలనాయుడు, కన్నేపల్లి ప్రసాద్, పూతి రమణ, దుల్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వ్యవస్థ అభివృద్ధికి పల్లె పండుగ

- గ్రామ సభలో ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: గ్రామీణ వ్యవస్థను మెరుగుపరిచి అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం వంజంగి దూసి పంచాయతీల్లో 77.20 లక్షల రూపాయలతో గ్రామాల అంతర్గత సిమెంట్ రోడ్లు, సీసీ డ్రైన్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దూసిపేటలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు నిత్యం ప్రజా గ్రీవె న్స్‌ను నమోదు చేయాలని ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే వాటిని సంక్షేమ పథకాలకు అప్లోడ్ చేయాలని తెలిపారు. సచి వాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని కర్తవ్యం నిర్వహణలో ప్రజలకు జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో అభివృద్ధికి కావలసిన నమూనాను అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం, వ్యక్తిగత లబ్ధికోసం వచ్చే గ్రీవెన్స్‌లో నమోదు చేయాలని అలాగే 55 ఏళ్ల దాటిన వ్యక్తులను కుటుంబాల వారీ వివరాలు సచివాలయంలో ఉండాలన్నారు. లేని వైకల్యాన్ని సృష్టించి కొంతమంది అనర్హులు పింఛన్ పొందుతున్నారని అటువంటి వారిని గుర్తించి వారి వికలాంగత్వంపై రిమ్స్‌కు రిఫరెన్స్ ఇవ్వాలని తెలిపారు. దొంగ సర్టిఫికెట్లు అందిస్తున్న కొంతమంది వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని చంద్రశేఖర్, అమర్నాథ్, ఢిల్లేశ్వరరావు, తమ్మినేని అప్పల నాయుడు, ఎండ అప్పల నాయుడు, కోరుకొండ వెంకటరమణ, జనసేన యువ నాయకుడు వీరఘట్టపు బాలమురళీకృష్ణ, ఎంపీడీవో, ఉపాధి, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

సంతలబైలి, ఎర్రన్నపేట గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాల పరిశీలన

విశాలాంధ్ర-జలుమూరు: మండలం టీ ఎల్ పాడు పంచాయతీ పరిధిలో సంతలబైలి, ఎర్రన్నపేట గ్రామాల్లో గురువారం వ్యాధి నిరోధక టీకాల పరిశీలన కార్యక్రమాన్ని జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహించింది. వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించుకోవాలని సర్వే చేయడం జరిగిందని పర్యవేక్షకులు చిన్న రాజులు తెలిపారు. గర్భిణీ స్త్రీలకు డిటి 1 2 టీకాలు మరల అప్పుడే పుట్టిన శిశువు నుండి అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు వేయించవలనని ఆయన అన్నారు. ధనుర్వాతాము, పచ్చకామర్ల, నీల విరోచనాల పై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు హెచ్ ఎస్ ధనలక్ష్మి, ఏఎన్ఎం రూప, ఎల్ హెచ్ బి రవి పలువురు పాల్గొన్నారు.

19న జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2024 పార్ట్ 2

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ప్రతిష్టాత్మక జీ తెలుగు కుటుంబం అవార్డ్స్‌ను ఘనంగా నిర్వహించింది. జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్-2 అక్టోబర్ 19 సాయంత్రం 6 గంటలకు ప్రసారం చేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎనర్జిటిక్ యాంకర్స్ సుధీర్, వర్షిణి ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారన్నారు. ఆషిక, సౌందర్యల అద్భుతమైన ప్రదర్శనతో అన్ని సీరియల్ కుటుంబాల ప్రత్యేక ఎంట్రీతో ఘనంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగిందన్నారు. మేఘసందేశం సీరియల్ నటి భూమి నృత్య ప్రదర్శన ఈవెంట్కి మరింత సంప్రదాయ కళను తీసుకొచ్చిందన్నారు. యాంకర్ వర్షిణి జీ హీరోలందరితో కలిసి అద్భుతమైన మాస్ డాన్స్‌తో వీక్షకుల్లో ఉత్సాహంనింపిందన్నారు. టాలీవుడ్ లవ్లీ పెయిర్ తరుణ్, శ్రియశరణ్ ఎంట్రీ షో మరింత ఆహ్లాదంగా సాగిందన్నారు. శ్రియ సినిమాల్లోని ప్రసిద్ధిగాంచినసన్నివేశాలను డ్రామా జూనియర్స్ పిల్లలు రీక్రియేట్ చేసి నవ్వులు పూయించారన్నారు.తరుణ్తో జీ తెలుగు తారల అల్లరి, శ్రియ డాన్స్పెర్ఫామెన్స్ షోకి హైలెట్గా నిలిచాయన్నారు. ఉత్తేజకరమైన, వినోదభరితమైన, భావోద్వేగభరితమైన ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగిందన్నారు. మీప్రియమైన తారలు వారి అసాధారణ ప్రతిభ,సృజనాత్మకత, అంకితభావాన్ని ప్రశంసిస్తూ ప్రతిష్ఠాత్మక జీకుటుంబం అవార్డులు 2024 అందుకున్నక్షణాల్లో జీ తెలుగు వేదికగా మీరూ భాగంకావాలన్నారు.

జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌పై అవగాహన

విశాలాంధ్ర-టెక్కలి : జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శోభరాణి అన్నారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్, పోషణ పౌష్టిక శిక్షణపై అంగన్వాడి సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జెడ్బిఎన్ఎఫ్ అనేది ఒక రకమైన రసాయన రహిత వ్యవసాయమని, పురుగు మందులు, ఎరువులు ఉపయోగించకుండా పంటలను పండించే పద్ధతిని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని అన్నారు. న్యూట్రి గార్డెన్, కిచెన్ గార్డెన్ అంశాలపై అంగన్వాడి సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రసాయనాలు వాడకుండా ఆకుకూరలు, పౌష్టిక ఆహారాలకు సంబంధించిన పదార్థాలను పంటలను పండించుకోవాలని సూచించారు. కిచెన్ గార్డెన్ ఆకుకూరల వలన వల్ల పిల్లలకు, గర్భిణీలకు ఎంతో పౌష్టిక ఆహారం చేకూరుతుందని అన్నారు. జీవమృత తాజా ఆవుపేడ తో ఎలా వినియోగించుకోవాలని అవగాహన కలిగించారు. న్యూట్రియన్ కిచెన్ గార్డెన్ కి సంబంధించి నందిగాం మండలానికి మూడు సెంటర్లలో ఈ పద్ధతులను త్వరలోనే ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీబాయి, ఏసిడిపిఓ ఉమామహేశ్వరి, జడ్బిఎన్ఎఫ్ సిబ్బంది లోకేష్, బాలకృష్ణ, అశోక్, సూపర్వైజర్లు జలజాక్షి, లక్ష్మీ, సంధ్యాభాయ్ అంగన్వాడి కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన పలువురు పోలీసులు అధికారులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డిని గురువారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయం ఏపీఎస్పీ మొదటి బెటాలియన్ అదనపు కమాండెంట్ పి.సత్తిబాబు, కాశీబుగ్గ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.తిరుపతిరావు, డిసిఆర్బి ఎస్ఐ ఎం.డి.అమీర్ అలీ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. జిల్లా ఎస్పీని కలిసిన వారిలో శ్రీకాకుళం జిల్లాలో నూతనంగా ఏర్పడిన ఏపీఎస్పీ (ఎచ్చెర్ల) మొదటి బెటాలియన్ అదనపు కమాండెంట్గా పి.సత్తిబాబు గురువారం ఎచ్చెర్ల నందు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఆయన ఇదివరకు ఇంటెలిజెన్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై మొదటి ఏపీఎస్పీ బెటాలియన్ అదనపు కమాండెంట్ గా బాధ్యతలు చేపట్టారు. సాధారణం బదిలీల్లో భాగంగా కాశీబుగ్గ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బాధ్యతలు చేపట్టిన ఎం. తిరుపతిరావు డిసిఆర్బి ఎస్ఐ ఎం.డి.అమీర్ అలీ జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-టెక్కలి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె పండగలో భాగంగా రాధవళ్ళభాపురం పంచాయతీలో సీసీ రహదారి నిర్మాణానికి గురువారం మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వాన్ని, కూటమి ప్రభుత్వముతోనే అభివృద్ధి కార్యక్రమాలు సాధ్యమవుతాయని అన్నారు. పల్లె పండగలో గ్రామాలలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా చేయడమే ఈ పల్లె పండగ ముఖ్య ఉద్దేశమని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పంచాయతీలలో ఉన్న గ్రామాల సమస్యలను ఒక్కొక్కటిగా త్వరలోనే పూర్తి అవుతాయని, ప్రతి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతుందని అన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి రహదారి లేక అనేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు ఈ శంకుస్థాపనతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ శంకుస్థాపనలో ఎంపీడీవో లక్ష్మీబాయి, ఏపీవో, సింగుపురం సీతారామ్, సీపాన సంజీవ్,బగాది జగన్నాథం, పైడి అమర్నాథ్ సచివాలయ సిబ్బంది, తదితరి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్బన్ క్రూయిజర్ టైజర్ లిమిటెడ్ ఎడిషన్ విడుదల చేసిన టొయోటా కిర్లోస్కర్ మోటార్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఈరోజు తమ అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్ అర్బన్ క్రూయిజర్ టైజర్ యొక్క లిమిటెడ్ ఎడిషన్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక ఎడిషన్, స్టైల్ ప్రీమియం నెస్‌ని మెరుగుపరచడంపై దృష్టి సారించి రూపొందించబడిందని టొయోటా కిర్లోస్కర్ మోటార్, సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ విభాగ ప్రతినిధి శబరి మనోహర్ తెలిపారు. కస్టమర్‌లకు మరింత ఆనందం ఇస్తూ ఈ పరిమిత ఎడిషన్ రూ. 20,160 విలువ కలిగిన టొయోటా జెన్యూన్ యాక్సెసరీస్ (టిజిఏ) ప్యాకేజీతో వస్తుందన్నారు. అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివ్ ఎడిషన్‌ను ఇటీవలే పరిచయం చేసిన తర్వాత అర్బన్ క్రూయిజర్ టైజర్ ఫెస్టివ్ ఎడిషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. 1.0 లీ టర్బో 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ మరియు 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌లో ఇది లభిస్తుందన్నారు. సమీప డీలర్ షిప్‌లో గాని, ఆన్‌లైన్‌లో గాని బుక్ చేసుకోవచ్చని చెప్పారు.

'తమ్మినేని'ని సత్కరించిన ఎల్ఎన్ పేట నాయకులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఎల్ ఎన్ పేట మండలానికి చెందిన వైఎస్ ఆర్ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కు అభినందనలు తెలియజేశారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ పార్టీ పరిశీలకులుగా నియమితులైన తమ్మినేని సీతారాం ను తన నివాసం వద్ద, ఎల్ ఎన్ పేట మండలానికి చెందిన మాజీ ఎంపీపీ సిమ్మ సాంబమూర్తి మరియు సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు దుశ్శాలువాలతో సత్కరించి శుభాభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శోభన్ బాబు, సర్పంచులు చిన్నారావు, విష్ణు, సజ్జల యోగేశ్వరరావు, కొల్లా రామారావు, రావాడ మన్మధరావు, రెడ్డి సీతారాం, కరణం చంద్రి నాయుడు, శెట్టి రామారావు, ఆరిక లక్ష్మి నారాయణ, తదితర వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ నిరసన

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : విద్యుత్ చార్జీల పెంపును, ప్రభుత్వం తీసుకువచ్చే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్స్టేషన్‌ల ముందు నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునివ్వడం జరిగిందని, నేడు నిర్వహించే ఈ నిరసన కార్యక్రమంలో ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని, సిపిఎం పార్టీ జిల్లా నాయకులు పూనెం. సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యవసరాల ధరలు పెరగడం వలన ఆర్థిక భారాలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉన్న మీటర్లు ఊడబీకి స్మార్ట్ మీటర్లు పెడతామని ప్రభుత్వ క్యాబినెట్ ఆమోదం తెలపడం మూలుగుతున్న నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఉందని తక్షణమే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబం పై భారాలను మోపబడే ఈ స్మార్ట్ మీటర్ల విధానంపై జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి సోయం చినబాబు పులి సంతోష్ కుమార్ పంకు సత్తిబాబు కారం సుందరయ్య పూనెం ప్రదీప్ కుమార్ గుండిపూడి లక్ష్మణరావు కమ్మచిచ్చు సత్యనారాయణ పోడియం శ్రీరామ్మూర్తి శ్రీరపు తాతబాబు నాలారపు ప్రకాష్ రావు వేటగాని సూరి తదితరులు పాల్గొన్నారు.

మరువాడలో జంగిల్ క్లియరెన్స్ పనులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మరువాడ పంచాయతీలో సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి దాసురాజు ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమం చేపట్టారు. ఆర్.మరువాడ గ్రామం నుంచి యం.మరువాడ బస్ స్టాప్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొదలను జెసిబి యంత్రాలతో తొలగించారు. ఈమార్గంలో ముళ్ల పోదలు దట్టంగా అల్లుకోవడం వల్ల, ఇటీవల పలు ప్రమాదాలు జరిగాయి. దీంతో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రహదారికి ఇరువైపుల పొదలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి.రామిరెడ్డి, వార్డ్ మెంబర్ తిప్పాన వసంతరెడ్డి, సెక్రటరీ. డిక్కల.వాసు, లైన్ మెన్ హేమసుందర్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనాన్ని నిర్మించండి

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పట్టణంలో పెద్దకోమటి వీధి ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రానికి శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని జైభీం సేన గురువారం సోంపేట డిప్యూటీ తహశీల్దార్ మహేష్‌కు వినతిపత్రం అందజేసింది. సంస్థ అధ్యక్షులు ఈశ్వరరావు, వ్యవస్థాపకులు డాక్టర్ నగిరి మోహనరావు తదితరులు వినతిపత్రాన్ని అందించి అంగన్వాడీ బాలల పరిస్థితులను వివరించారు. శాశ్వత భవనం లేక పాఠశాల యాజమాన్యం అంగన్వాడీ నిర్వహణకు అనుమతించడం లేదని పేర్కొన్నారు. భవనం మంజూరయ్యేలా కృషి చేయాలని అన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలం కొర్లాం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మామిడిపల్లి ఫీడర్‌లో చెట్లు కొమ్మలు కొట్టడం జరుగుతున్నందున ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. మామిడిపల్లి, రాజాం, గొల్లవూరు, టి.శాసనాం, బట్టిగళ్లూరు, కొత్త రాజాం, సిరిమామిడి, ఎర్రముక్కాం, ఉప్పలాం, అనంతపురం, తదితర ప్రాంతాలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలకు టిఎంఎఫ్ సామాగ్రి అందజేత

విశాలాంధ్ర-కవిటి : మండలంలో వున్న 102 ప్రభుత్వ పాఠశాలలకు విద్య శాఖ కార్యాలయం నుండి టీఎంఎఫ్ సామాగ్రి సరఫరా చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి తెలిపారు. మరుగుదొడ్ల పరిశుభ్రతలో భాగంగా ప్రభుత్వం అందజేసిన ఫినాయిల్ ఇతర సామాగ్రిని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి చేతులమీదుగా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లింగరాజ్ ప్రసాద్ పట్నాయక్, మురళి ప్రకాష్‌సి ఆర్ పి హేమరావు తదితరులు పాల్గొన్నారు.

దోచుకున్న బెల్ట్ షాపు యజమానులు... పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-జలుమూరు : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన మద్యం విధానాలను కొత్త మద్యం దుకాణంలో ఏర్పాటు చేస్తామని సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో బెల్ట్ షాపులు వారు ముందుగా తెలుసుకొని గత ప్రభుత్వ షాపుల నుండి అధిక సంఖ్యలో మద్యం దిగుమతి చేసుకొని ఇష్ట రాజ్యాంగ నచ్చిన విధంగా ప్రజల్ని మోసగించి అమ్మకాలు చేపట్టారు. కనీసం ప్రధాన రహదారులు పక్కన బారులకు భిన్నంగా ఈ అమ్మకాలు జరుగుతున్న పట్టించుకునే నాధుడు లేడని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఏముంది గర్వకారణం బెల్టు షాపులుదేరాజ్యం అంటున్నారు. ఏది ఏమైనా అధికారుల నిర్లక్ష్యం కచ్చితంగా కనిపిస్తుందని తూతూ మంత్రంగా కేసులు పెట్టి విడిచిపెడుతున్నారని విమర్శలు సర్వత్ర వినిపిస్తున్నాయి. దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తే తప్ప మందుబాబులకు న్యాయం జరగదనే విమర్శలు ఉన్నాయి.

104 ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం లక్కవరం గ్రామంలో 104 వైద్యసేవల విభాగం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి వైద్యాధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు. కొర్లాం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌజన్య, 104 సిబ్బంది ముకుందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధరల నియంత్రణపై అసెంబ్లీ కమిటీ వేసిన ఘనత టీడీపీదే

- పార్టీ పదవి కోసం ప్రతిపక్షాలపై విమర్శలా
- విమర్శ చేయడమే వైసిపి నైజం
- టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి "తమ్మినేని"

విశాలాంధ్ర-ఆమదాలవలస: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయవలసిన ప్రతిపక్ష నాయకులు వారి పార్టీ పదవుల కోసం ఒకే అంశాన్ని నలుగురు ప్రెస్మీట్ల ద్వారా వివరించటం సమంజసంగా లేదని రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. గురువారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే ధరల నియంత్రణపై మంత్రులతో అసెంబ్లీ కమిటీ వేసిన ఘనత టిడిపి దే అని అన్నారు. వైసిపి పాలనలో ఉల్లి 200 కిలో ఉన్నప్పుడు మీకు కన్నీళ్లు కనిపించలేదని విమ ర్శించారు. ధరల నియంత్రణలో భాగంగా అన్ని వర్గాల వారికి నిత్యవసర సరుకులు అందే విధంగా రైతు బజార్ల ద్వారా తక్కువ ధరలకే విక్రయిస్తున్న కూటమి ప్రభుత్వంపై విమర్శలు తగదన్నారు. పార్టీ ఇన్చార్జి పదవ కోసం ఒకే అంశాన్ని నలుగురు రకరకాలుగా ప్రెస్ మీట్ లు పెట్టడం పై ఆక్షేపించారు. వైసీ పీలో గ్రూపులు గోల ఎక్కువైందని ఎవరికి వారు విషయం, విధానం తెలుసుకోకుండా విమర్శలు చేయడమే లక్ష్యంగా వ్యవహరి స్తున్నారని దుయ్యబట్టారు. ఇసుక విధానం లో పారదర్శకతతో 1200 రూపాయలకే ట్రాక్టర్ ఇసుక లబ్ధిదారు ఇంటి వద్దకు వస్తుం దని దీనిపై విమర్శలు చేయటం ఏమిటని నిలదీశారు. ఆముదాలవలసలు 13 షాపు లకు 375 దరఖాస్తులు వస్తే అందులో పార దర్శకంగా అందరి సమక్షంలో లాటరీ ద్వారా షాపులను అందించామని అన్నారు. మద్యం విక్రయాల్లో పాలకులు అడ్డుకున్నారని విమ ర్శించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అభివృద్ధి అంటే ఏమిటో నాలుగు నెలల లోని 55 కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్ర మాలు చేపడుతున్నట్లు వివరించారు. ఆము దాలవలస నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ ఐటిఐ మంజూరు చేయించిన ఘనత కోన రవికుమార్ ది అని, అలాగే ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం స్థలం కూడా సేకరించమ న్నారు. అభివృద్ధి అంటే ఇదని విధానాలు లేని విమర్శలు కాదని కేతువు పలికారు. ప్రజా సమస్యల పైన, ప్రభుత్వ విధానాలపైన, తెలుగుదేశం పార్టీ పైన చేయవలసిన ప్రతి పక్షాలు రవికుమార్ పై విమర్శలు చేయటం తగదన్నారు. విధి విధానాలు తెలుసుకొని మాట్లాడాలని ప్రతిపక్షాలకు హేతో పలికారు. ఈ కార్యక్రమంలో బోర గోవిందరావు, ఇంజ రాపు విశ్వనాథం, తంగి గురయ్యా, జీడి ప్రసాద్, మురళీధర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

అయ్యప్ప భక్తుల కోసం ప్రత్యేక బస్సులు...

విశాలాంధ్ర-టెక్కలి : శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక అద్దె బస్సుల సౌకర్యము కల్పిస్తున్నట్లు టెక్కలి డిపో మేనేజర్ యన్ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం వలే టెక్కలి డిపో నుండి శబరిమల యాత్రకు ప్రత్యేక టూర్ ప్యాకేజీలతో నిర్వహించినట్లు ఈ సంవత్సరం కూడా మూడు రకాల ప్రత్యేక టూర్ ప్యాకేజీలతో ప్రత్యేక బస్ సర్వీసులను నడపనున్నట్లు తెలిపారు.

ప్యాకేజీల వివరాలు... ఐదు రోజుల యాత్ర కి సంబంధించి టెక్కలిలో బయలుదేరి విజయవాడ ఎరుమేలి పంబ స్వామి సన్నిధానం చేరుకొని దిగువ ప్రయాణంలో శ్రీపురం కాణిపాకం తిరుపతి అన్నవరం సింహాచలం మీదుగా టెక్కలి చేరుకుంటారని, 7 రోజుల యాత్రకిలి సంబంధించి టెక్కలిలో బయలుదేరి విజయవాడ కాణిపాకం శ్రీపురం భవాని పళని ఎరుమేలి పంబ సన్నిధానం చేరుకొని తిరుగు ప్రయాణంలో మధురై రామేశ్వరం తిరుపతి శ్రీకాళహస్తి విజయవాడ అన్నవరం సింహాచలం మీదుగా టెక్కలి చేరుకుంటారని. 11 రోజుల యాత్రకిలి సంబంధించి టెక్కలిలో బయలుదేరి విజయవాడ శ్రీశైలం మహానంది కాణిపాకం శ్రీపురం భవాని పళని గురువాయూర్ ఎరిమేలి పంబ సన్నిధానం చేరుకొని తిరుగు ప్రయాణంలో త్రివేండ్రం కన్యాకుమారి మధురై శ్రీరంగం కంచి తిరుపతి శ్రీకాళహస్తి విజయవాడ అన్నవరం సింహాచలం మీదుగా టెక్కలి చేరుకుంటారని, ఇవి కాక భక్తులు కోరిన విధంగా కూడా యాత్రలు బుక్ చేసుకునే సౌకర్యం కలిపిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరముల కొరకు డిపో మేనేజర్ టెక్కలి 9959225611, అసిస్టెంట్ మేనేజర్, టెక్కలి 7382923311, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్. 9908190801 నెంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

జిల్లా ఆసుపత్రిలో రోగుల ఇక్కట్లు...

విశాలాంధ్ర-టెక్కలి: మండల కేంద్రంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు అనేక సమస్యలతో ఇక్కట్లు పడుతున్నట్లు రోగులు బిజెపి నాయకులకు ఫిర్యాదు చేశారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు బిజెపి మోర్చ జిల్లా అధ్యక్షులు జన్ని. పరమేశ్వరరావు, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు పెనిమిటి ఉమాబాబు గురువారం ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం వారు రోగులతో వైద్య చికిత్స కోసం ఆరా తీయగా... కడుపు నొప్పితో వచ్చిన గిరిజన రోగికి చూడకుండానే శ్రీకాకుళం రెఫర్ చేసి వెళ్ళిపొమ్మని చెప్పారని, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నటువంటి వృద్ధురాలికి మందులు ఇచ్చి ఇంటికి వెళ్లిపోమంటున్నారని తెలిపారు. మృతి చెందిన వ్యక్తి, బెడ్ పైన బెడ్ షీట్ తీయకుండానే కొత్తగా వచ్చిన రోగులకు పడుకోబెట్టి చికిత్స అందజేస్తున్నారని వాపోయారు. పేద రోగులకు ప్రమాదాలు జరిగినప్పుడు, గర్భిణీలకు ఆపరేషన్ జరిగినప్పుడు రక్తం చాలక పోయిన సమయంలో ఆస్పత్రిలో ఆ రక్తం లేదని, మీరు బయట నుండి తీసుకువస్తేనే ఆపరేషన్ చేస్తామని అంటున్నారని బిజెపి నాయకుల వద్ద మొరపెట్టుకున్నారు. ప్రతి రోజు కనీసం బెడ్ సీట్లు కూడా మార్చడం లేదని, వాటి నుండి దుర్వాసన వెదజల్లుతుందని, తమ తెచ్చుకున్న దుప్పట్లు బెడ్ల పై వేసుకుని పడుకోవాల్సి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. పేదలమని ఈ ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే ఇక్కడ చికిత్స సరిగ్గా అందటం లేదని, ఇంజక్షన్ చేయడానికి వచ్చిన నర్సులు దురుసుగా ప్రవర్తించి గంటలు కొద్ది సమయం వెల్లదీస్తున్నారని తెలిపారు. డబ్బులు లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో ఇన్ని ఇక్కట్లు పడాల్సి వస్తుందని బిజెపి నాయకులకు చెబుతూ కన్నీరు పెట్టుకున్నారు. బిజెపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ దృష్టికి తీసుకెళ్తామని రోగులకు ధైర్యాన్ని కల్పించారు.

క్యాచ్ అప్ రూల్ సరికాదు

- రవాణాశాఖలో ఎఓ పోస్టుల ప్రమోషన్ జాబితాలో అన్యాయం
- రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భరత్ భూషణ్ రాజ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: రవాణా శాఖలో ఏఓ పోస్టుల ప్రమోషన్ జాబితాలో క్యాచ్అప్ రూల్ అమలు చేయడం ఎస్సీ, ఎస్టీ అధికారుల ప్రమోషన్లకు అన్యాయం చేయడమేనని నూతులపాటి భరత్ భూషణ్ రాజ్ అన్నారు. క్యాచ్ అప్ రూల్ విధానాన్ని ఖండిస్తూ ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఫోరమ్ తరపున గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రక్రియ పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, 85వ రాజ్యాంగ సవరణ ద్వారా జీవో నెంబర్ 26 /2009 ప్రకారం అమలు చేయాలన్నారు. రాష్ట్ర అధికారులు దీనిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా క్యాచ్అప్ రూల్ అమలు చేయడాన్ని దళిత హక్కుల పరిరక్షణ సమితి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ఉత్తరాంధ్ర ఫోరమ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్ లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉందన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు జీవోలను తుంగలో తొక్కిన రవాణా శాఖ జోన్- 3 అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. అన్యాయాన్ని సరిదిద్దాలని, ఇదే విధానాన్ని మిగతా శాఖలకు కూడా అనుసరించకుండా చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రాజ్యాంగ హక్కులను కాపాడాలని ఉత్తరాంధ్ర జేఏసీ ఫోరం ప్రభుత్వాన్ని కోరింది. ప్రొమోషన్స్‌లో కాన్సీక్వెన్సియల్ సీనియార్టీని అమలు చేయాలని, ప్రమో షన్ల ప్రక్రియలో క్యాచ్ అప్ రూల్‌ని విడనాడాలని ఎస్సీ, ఎస్సీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పోతల దుర్గారావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు అంపోలు ప్రతాప్ ప్రకటనలో డిమాండ్ చేశారు.

వాల్మీకి మహర్షికి ఘన నివాళులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: మహర్షి వాల్మీకి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఘనంగా నివాళులర్పించారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ముందుగా జ్యోతి వెలిగించిన అనంతరం మహర్షి వాల్మీకి చిత్ర పటానికి గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం. అప్పారావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి అనురాధ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి మీనాక్షి, తదితరులు ఉన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి బి. శాంతి శ్రీ, ఆర్ఐఓ దుర్గారావు, గిరిజన సంక్షేమ శాఖ ఎటిడబ్ల్యూఓ శ్రీనివాసరావు, విద్యా శాఖ ఎడి లియాఖత్ అలీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : భారత జాతికి, సంస్కృతికి తొలి గురువు వాల్మీకి మహర్షి అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ

కళాశాల ప్రిన్సిపాల్, డా. పి. లత అన్నారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యాశాఖ ఆదేశాల మేరకు మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి ఆమె పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం డా. లత మాట్లాడుతూ వాల్మీకి వ్యక్తిగత జీవితం నుండి ప్రతి ఒక్కరు స్ఫూర్తిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, డా. జి. రవికుమార్, డా. అన్నాజీ రావు, శాంతి హేమ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మందస: రామాయణాన్ని రచించిన వాల్మీకి

మహర్షి జయంతి వేడుకలు మందస ఎంపిడివో కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి ఎంపిపి డొక్కరి దానయ్య పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో వెలుగు అధికారి జి.ప్రసాద్, ఎంపిడివో బి.రుషేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి: సంస్కృతంలో ఆదికవిగా పేరుగాంచి

రామాయణం వంటి అద్భుతమైన ఇతిహాసాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతిని మండల కేంద్రం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు బెందాళం మల్లేశ్వర రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు చేతుల మీదుగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఆటవిక గిరిజన తెగకు చెందిన వాల్మీకి మహర్షి అకుంఠిత దీక్షతో మహర్షిగా మారి రామాయణాన్ని రాసి ప్రపంచ ప్రజలందరికీ మార్గదర్శకత్వం చూపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కిన్నెరవాడలో ఘనంగా గౌరీ పౌర్ణమి మహోత్సవాలు

విశాలాంధ్ర-జలుమూరు : సారవకోట మండలం కిన్నెరవాడ గ్రామంలో కొలువైవున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో గౌరీ పౌర్ణమి సందర్భంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆధ్యాత్మిక చింతన పై పలువురు వేద పండితులు దైవ అనుగ్రహం పై భక్తులకు సూచించారు. సత్సంగ కార్యక్రమంలో అనేక ప్రాంతాల నుండి వచ్చి భగవంతుడు ధర్మం పలు అంశాలపై ప్రజలకు తెలియజేశారు. అనంతరం ప్రజల సహకారంతో ఆలయ ప్రధాన అర్చకులు కే సిద్దయ్య స్వామి పర్యవేక్షణలో అన్న సందర్భంగా జరిగింది. ముఖ్యంగా గో విశిష్టత గోపూజ కార్యక్రమాల్ని ఘనంగా నిర్వహించారు.